క్లుప్తంగా

జనారణ్యంలోకి జింక



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరం లోని బీసీ కాలనీలోకి శుక్రవారం వేకువన ఓ జింక వచ్చింది. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి దారితప్పి వచ్చిన జింకను గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులు సమాచారం అందజేశారు. అటవీశాఖ అధికారి శ్రీను జింకను పట్టుకుని సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



సంగం: స్థానిక చెక్‌పోస్టు సెంటర్ సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.వివరాలు..సంగం సెంటర్‌లో పానీపూరి విక్రయించే అఖిలేష్ చెక్‌పోస్టు సెంటర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని నిలిపి ఉన్నాడు. ఈ క్రమంలో ఓ ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొని పరారైంది. ఈ ప్రమాదంలో అఖిలేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో ఎస్సై రాజేష్ క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. పరారైన ట్రాక్టర్‌ను కొంత దూరంలో అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభ్యాసనా సామర్థ్యాలను పెంపొందించాలి

ఉదయగిరి: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఉపాధ్యాయులు నిరంతరం పరిశీలిస్తూ పెంపొందించాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు సూచించారు. మండలంలోని జీ చెరువుపల్లి, వడ్డిపాళెం పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. హెచ్‌ఎం లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయిని విమల, పీఎంసీ చైర్మన్ మహేశ్వరి, సీఆర్‌ఎంటి మాల్యాద్రి పాల్గొన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని విరువూరు, నార్త్‌కృష్ణంరాజుపల్లె, తదితర పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో సంపద కేంద్రాలను వారం రోజుల్లోగా వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి సంపదగా మలిచి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలన్నారు.

సబ్సిడీ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

అల్లూరు/సీతారామపురం/చేజర్ల: కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అల్లూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బ్యాంకర్లు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 145 మంది హాజరయ్యారు. అలాగే సీతారామపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 247 మంది దరఖాస్తుదారులకు గానూ 95మంది హాజరైనట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. అలాగే చేజర్ల మండలంలో 236 మంది దరఖాస్తు చేసుకోగా, పంచాయతీల వారీగా వచ్చిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు.

వీధికుక్కల స్వైరవిహారం

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మనుషులతో పాటు పశువులు, జీవాలపైన దాడి చేసి గాయపరుస్తుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల ఎస్సీ కాలనీకి చెందిన యువకుడిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తాజాగా శుక్రవారం గ్రామంలోని తాడికొండ శేషయ్యకు చెందిన మేకపిల్లపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వీధి కుక్కల బెడదను తొలగించాలని పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు అవగాహన

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంటలో రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై ఏఓ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం అవగాహన కల్పించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే వ్యవసాయశాఖ ద్వారా అమల య్యే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

రాజకీయ సిఫార్సులకే రుణాలు

- డమ్మీగా కార్పొరేషన్ రుణ మంజూరు కమిటీలు
- ఎమ్మెల్యే కార్యాలయం నుంచే లబ్ధిదారుల ఎంపిక
- టీడీపీ కార్యకర్తలకే పెద్దపీట
- కొత్త సంప్రదాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం



వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఉదయగిరి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అందుకు భిన్నంగా రాజకీయ సిఫార్సులు ఉంటేనే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారు. 2014లో జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇవ్వగా, ఈ దఫా ఎమ్మెల్యే కార్యాలయాలు అందుకు వేదికగా మారాయి. అర్హతతో ప్రమేయం లేకుండా అధికార పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేలా పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరులో కమిటీలను డమ్మీగా మార్చి ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులను ఎంపిక చేసి పంపుతుండడమే అందుకు నిదర్శనం. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు సంబంధించి కాపు, ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు 295 యూనిట్ల సబ్సిడీ రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ యూనిట్లకు 50 శాతం సబ్సిడీని ఇవ్వనుంది. తరగతులను బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు సబ్సిడీని ఇవ్వనుంది. దీంతో టీడీపీ కార్యకర్తలు సబ్సిడీ రుణాలపై కన్నేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

గ్రామాల్లోని తమ అనుచరులకు రాజకీయ లబ్ధి చేకూర్చే నిమిత్తం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రుణ మంజూరు కమిటీలతో సంబంధం లేకుండా గ్రామాల వారీగా టీడీపీ నాయకులను పిలిపించుకుని దరఖాస్తులను పరిశీలించి జాబితా తయారు చేస్తున్నారు. గత మూడ్రోజుల నుంచి మండలాల వారీగా వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబితాలు తయారు చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు ముగ్గురి పేర్లను ఎంపిక చేసి వరుస ప్రాధాన్యత క్రమంలో అర్హత ఉన్నవారికి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలు నిజంగా అవసరమైన వారికి, యూనిట్లు స్థాపించి స్వయం ఉపాధి పొందలన్నా కోరిక ఉన్నవారికి, రాజకీయ అనుగ్రహం లేని వారికి వచ్చే అవకాశం లేకుండాపోయింది.

డమ్మీలుగా కమిటీలు

ప్రతిమండలానికి సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అందులో ఎంపీడీఓతో పాటు బ్యాంకర్లు సభ్యులుగా ఉన్నారు. వీరు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి అర్హత ఆధారంగా యూనిట్లు మంజూరు చేయాల్సి ఉంది. కానీ కమిటీలు మండల పరిషత్ కార్యాలయంలో పేరుకే ఇంటర్వ్యూలు నిర్వస్తున్నాయి. కానీ లబ్ధిదారుల ఎంపిక మాత్రం ఎమ్మెల్యే కార్యాలయంలోనే జరుగుతోంది. దీనిపై ఓ బ్యాంకు మేనేజర్ స్పందిస్తూ 'తాను గత 20 ఏళ్లుగా బ్యాంకులో పని చేస్తున్నాను. గతంలో ఎప్పుడు కూడా లబ్ధిదారుల ఎంపిక కమిటీతో సంబంధం లేకుండా జరగలేదు..గతంలో రాజకీయ నేతలు తమ అనుచరులకు ప్రాధాన్యత ఇవ్వమని చెప్పేవారు..కానీ ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా రాజకీయ నేతల కనుసన్నల్లోనే జాబితాను రూపొందిస్తున్నారు' అని నిస్సహాయత వ్యక్తం చేయడం పరిస్థితిని తెలియజేస్తోంది. ఉదయగిరి నియోజకవర్గంలో 295 యూనిట్లకు 1776 మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు రూ.7 కోట్ల విలువ చేసే రుణాలు ఇస్తున్నారు. అందులో రూ.3.5 కోట్లు సబ్సిడీ పోగా, మిగిలిన మొత్తాన్ని రుణంగా బ్యాంకర్లు అందజేయనున్నారు. వీటిని నిర్ణీత కాలవ్యవధిలో బ్యాంకర్లకు తిరిగి చెల్లించాలి. కానీ టీడీపీ కార్యకర్తలకు రుణాలు మంజూరు చేయాల్సి రావడంతో యూనిట్లు స్థాపించకుండానే సబ్సిడీని స్వాహా చేసి, రుణాలు తిరిగి చెల్లిస్తారో..లేదోనని బ్యాంకర్లు ఆందోళన చెందుతున్నారు.

సోమశిల జలాలపై సర్వే



సీతారామపురం: మండలానికి సోమశిల జలాలను అందించేందుకు 'సమర్థ్' కంపెనీ బృంద సభ్యులు పోలంగారిపల్లి, బసినేనిపల్లి ప్రాంతాల్లో శుక్రవారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిస్సీ మాట్లాడుతూ ప్రభుత్వం సోమశిల జలాల సరఫరా కోసం సర్వే ప్రక్రియను ప్రైవేట్ కంపెనీకి అనుమతి ఇచ్చిందని తెలిపారు. 2019లో ఒకసారి సర్వే చేపట్టారని, మళ్లీ ఇప్పుడు సర్వే ప్రారంభించారని తెలిపారు. ట్రంక్‌లైన్ ఏర్పాట్లతో మండలంలోని అన్ని గ్రామాలకు సోమశిల జలాలు అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని వివరించారు.

బొగ్గుబట్టీని తొలగించాలని వినతి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సచివాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యన బొగ్గుబట్టీని ఏర్పాటు చేశారు. బొగ్గుబట్టీ నుంచి వెలువడే కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. అధికారులు పరిశీలించి బొగ్గుబట్టీని ఇళ్ల మధ్య నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చిరస్మరణీయుడు మేకపాటి గౌతమ్‌రెడ్డి



మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లోని గౌతమ్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంగంలోని పెన్నా బ్యారేజ్ వద్ద..



నెల్లూరుపాళెం సెంటర్‌లో..

ఆత్మకూరు/సంగం/సోమశిల: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చిరస్మరణీయుడని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆత్మకూరులోని మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని గౌతమ్‌రెడ్డి కాంస్య విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నెల్లూరుపాళెం సెంటర్‌లోని మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహానికి కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. సంగం పెన్నాబ్యారేజ్ వద్ద ఉన్న గౌతమ్‌రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి రాజకీయాల్లో అజాతశత్రువుగా నిలిచారన్నారు. పార్టీలకతీతంగా అందరిని కలుపుకుని పోయి చిన్నవయసులోనే రాజకీయాల్లో పరిణతి చెందిన అరుదైన నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. జిల్లాతో పాటు ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని, ఆ ఫలాలు అందుకునేలోపే ఆయన మన మధ్యన లేకపోవడం తీరని లోటన్నారు. అనంతరం ఆత్మకూరు నుంచి ప్రత్యేక వాహనాల్లో నెల్లూరులో మేకపాటి నివాసంలో జరిగిన గౌతమ్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమానికి తరలివెళ్లారు. అక్కడ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆత్మకూరు నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి,కొండా వెంకటేశ్వర్లు, సయ్యద్ జమీర్, వెంగళరెడ్డి, తోడేటి మణి, వీ లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, కొప్పోలు వెంకటేశ్వర్లు, అంద్రా సుబ్బారెడ్డి, రహీం, రిజ్వాన్, ఎస్ ప్రతాప్, కల్పనారెడ్డి, చెన్నకేశవులు, జమ్ము, సీహెచ్ వెంకటేశ్వర్లు, సంగానికి చెందిన భారతి సిమెంట్ ట్రేడర్స్ రాంబాబు పెరుమాళ్ల రవీంద్రబాబు, శివ, పట్టెం వేణు, అనంతసాగరం జెడ్పీటీసీ సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఉరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని ఇంట్లోకి రానివ్వని కుమారులు

- ఇంటి ఎదుటే దీనంగా కూర్చున్న వృద్ధురాలు



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని రేవూరు బీసీ కాలనీకి చెందిన ముద్దలూరి చిన్నక్క అనే వృద్ధురాలు తన కుమారులు కనీసం ఇంట్లోకి రానివ్వ లేదంటూ ఇంటి ఎదుట కూర్చున్న వైనం శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. వృద్ధురాలికి ఆరుగురు సంతానం. వారిలో ఐదు మంది కొడుకులు, ఒక కూతురు. వారిలో ఒక కుమారుడు మృతి చెందాడు. మిగతా నలుగురు గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. కుమార్తె వివాహానంతరం కలువాయి గ్రామంలో ఉంటున్నారు. అయితే చిన్నక్క ఒక కుమారుని ఇంట్లో ఉంటుండగా 15 రోజుల క్రితం ప్రమాదవశాత్తు కింద పడడంతో కాలు, చేయి దెబ్బతిన్నాయి. వారు ఆమెకు చికిత్స చేయించకపోవడంతో ఆమె బాధ పడడం చుట్టుపక్కల వారు చూసి కలువాయిలో ఉన్న కుమార్తెకు సమాచారం అందించారు. కుమార్తె వచ్చి తల్లిని ఆమె వెంట తీసుకుని వెళ్లి నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించి పదిహేనురోజుల అనంతరం శుక్రవారం సాయంత్రం కుమారుల ఇంటి వద్దకు తీసుకురాగా వారు కనీసం ఆమెను గడప తొక్కనివ్వ లేదు. దీంతో చిన్నక్క ఇంటి ఎదుటే దీనంగా కూర్చొని ఉండడాన్ని చూసిన స్థానికులు ఆ వృద్ధురాలికి ఈ వయసులో ఎంత కష్టం వచ్చిందోనని చర్చించుకుంటున్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



కమిషనర్ ఉమా మహేశ్వరరావు

అల్లూరు: నగర పంచాయతీ ప్రజలు ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో రూ.2.50 కోట్ల మేర పన్ను బకాయలు ఉన్నాయని తెలిపారు.పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కనీసం పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలన్నా కష్టతరంగా ఉందన్నారు. నగర పంచాయతీని పంచాయతీగా మారిస్తేనే పన్నులు చెల్లిస్తామనడం సమంజసం కాదన్నారు. ఒకవేళ పంచాయతీగా మార్చిన పన్ను బకాయలను ఖచ్చితంగా చెల్లించాల్సిందేనన్నారు. మార్చిలోగా పన్ను బకాయిలను చెల్లిస్తే వడ్డీ పడదని తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు పన్నులు చెల్లించాలని కోరారు.

మాతృభాషను మరువరాదు



వరికుంటపాడులో విద్యార్థులు రూపొందించిన చార్టులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం



ఆత్మకూరులో విజేతలకు బహుమతుల ప్రదానం



కావలిలో తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాంజలి

ఆత్మకూరు: మాతృభాష ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని, జీవితంలో ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువరాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, కార్యవర్గ సభ్యులు కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్ యానాదిరెడ్డి, ఎస్‌వీ చలమయ్య, వెలిశెట్టి నారాయణ రావు, రామయ్య స్వామి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాస రాజు, నాగభూషణం, పీసీవీ సుబ్బయ్య, అచ్చోలు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కావలి: పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగుతల్లి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మాతృభాష విశిష్టతను వివరించారు. హెచ్‌ఎం ఎస్ ద్వారకనాథ్‌చౌదరి, విశ్రాంత హెచ్‌ఎం సీ శారద, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, ఉపాధ్యాయులు సీహెచ్ బ్రహ్మయ్య, జీ కల్యాణి, టీ శ్రీనివాసరెడ్డి, పీఈటీ కే శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డీ వీరభద్రయ్య, తెలుగు పండిట్ కే సుభద్ర ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మనిషి తనజీవితంలో తొలిసారిగా నేర్చుకునేది మాతృభాష అన్నారు. మాతృభాషపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలన్నారు.మాతృ భాషను కాపాడుకుంటే తల్లిని కాపాడుకున్నట్లేనన్నారు. తెలుగు లిపికి ప్రత్యేకప్రాధాన్యత ఉందన్నారు. అనంతరం విద్యార్థులు తెలుగు భాషలో తయారు చేసి ప్రదర్శించిన చార్టులను పరిశీలించారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్తేర్ బ్యూలా

కావలి: కేన్సర్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టీ లక్ష్మి సూచించారు. పట్టణంలోని జవహర్ భారతి నర్సింగ్ కళాశాలలో కేన్సర్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారించడం, జీవితకాలాన్ని పొడిగించడం సాధ్యమని తెలిపారు. ప్రతిఒక్కరూ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పనసరిగా చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ వ్యాధి మొదటి, రెండు దశల్లో ఎలాంటి నొప్పి, ఇబ్బంది ఉండదన్నారు. మూడు, నాలుగు దశల్లో మాత్రమే నొప్పి, బాధ ఉంటుందని తెలిపారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేర్ బ్యూలా మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల కారణంగా కేన్సర్ వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలన్నారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీ సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి చెడు అలవాట్లు ఉన్న వారికి మాత్రమే వస్తుందని, మిగిలిన వారికి రాదనేది అపోహ మాత్రమేన్నారు. కొంత వయస్సు వచ్చిన తర్వాత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జేబీ స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు ఆర్ మాల్యాద్రి ప్రసంగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన నానుడిని గుర్తుచేస్తూ ప్రతి ఒక్కరూ వ్యాయామం, నడక, యోగా క్రమం తప్పకుండా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మంత్రుల పర్యటన ఏర్పాట్ల పరిశీలన

సంగం: మండల కేంద్రమైన సంగంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శనివారం పర్యటించనున్నారు. తొలుత సంగంలోని పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం కొరిమెర్ల సమీపంలోని రైస్‌మిల్లును పరిశీలించనున్నారు. కాగా మంత్రుల పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి కార్యాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, అధికారులు శుక్రవారం పరిశీలించారు. డివిజనల్ కోఆపరేటివ్ అధికారి కే యలమందరావు, ఎస్సై రాజేష్, టీడీపీ మండలాధ్యక్షులు శ్రీనివాసులుయాదవ్ పాల్గొన్నారు.

పీ4 సర్వేను పక్కాగా చేపట్టాలి

వరికుంటపాడు: ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్ సర్వేను పక్కాగా చేపట్టాలని కందుకూరు డివిజన్ ఉపగణాంకాధికారి కే శ్రీనివాసరావు సూచించారు. వరికుంటపాడు సచివాలయం పరిధిలో జరుగుతున్న పీ-4సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. సర్వే బృందానికి సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ నాగూర్‌వలీ, ఏఎస్‌ఓ భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యత అంశాలకు నిధులు పెంచాలి

కావలి: కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని సీపీఎం ఆర్గనైజర్ టీ మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రజావ్యతిరేకమైన ప్రతిపాదనలను ఉపసంహరించుకుని ప్రజలకు ఉపయోగపడే ప్రతిపాదనలను పొందుపరచాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కావలి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గానికి సంబంధించి పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. యువజన విభాగం సమాధి చైతన్య, మహిళా విభాగం నందనవనం సీతాలక్ష్మి, రైతు విభాగం బత్తల మోహన్‌రెడ్డి, బీసీ సెల్ సన్నిబోయిన ప్రసాద్, ఎస్సీ సెల్ ఆండ్రూస్ కళ్యాణ్ కుమార్, ఎస్టీ సెల్ బాపట్ల వెంకటపతి, మైనార్టీ సెల్ షేక్ గయాజ్, విద్యార్థి విభాగం పామంజి శ్యామ్, మున్సిపల్ విభాగం కనుపర్తి రాజశేఖర్, లీగల్ సెల్ సుబ్రమణి కెన్నడీ, ట్రేడ్ యూనియన్ మడతల సుబ్బారెడ్డి, ఐటీ విభాగం గండ్ల శ్రీహర్ష, చేనేత విభాగం మేడా మాధవ, గ్రీవెన్స్ సెల్ పిట్టు శ్రీనాథ్, పంచాయతీరాజ్ విభాగం చింతలబోయిన వెంకటేశ్వర్లు, వలంటీర్స్ విభాగం మేకా విజయారావు, అంగన్‌వాడీ విభాగం నుశెట్టి పోలేశ్వరి, దివ్యాంగుల విభాగం పోసిన వెంకటరావు, సాంస్కృతిక విభాగం నాసిన శివలింగయ్య, ఆర్టీఐ విభాగం పేరం నాగరాజు, వాణిజ్య విభాగం నల్లూరు రమేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ బోగిరి విన్సెంట్, డాక్టర్స్ విభాగం డాక్టర్ శ్రీరాం మనోహర్‌బాబు, ఇంటెలెక్చువల్స్ ఫోరం నాగరాజు , సోషల్ మీడియా విభాగం రామాపురం ప్రవీణ్, బూత్ కమిటీలు చిరసాని వరుణ్‌రెడ్డి, ప్రచార విభాగం పుల్లా శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కావలి: పట్టణంలోని ఓ దుస్తుల షాపులో పనిచేస్తున్న మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.27వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాలు.. కావలిలోని ఓ దుస్తుల షాపులో పనిచేస్తున్న మైనర్ బాలికకు వైకుంఠపురం ప్రాంతానికి చెందిన ముప్పాల సాయి కిషోర్ అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడు. అనంతరం బాలిక పట్ల జుగుప్సాకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు కావలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2017లో ఫిర్యాదు చేశారు. మైనర్ బాలిక ఎస్సీ కావడంతో అప్పట్లో ఎస్సీ,ఎస్టీ సెల్ –1 డీఎస్పీ ఈ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేసి సాక్ష్యాలను పొందుపరిచారు. ఈ కేసును విచారించిన జడ్జి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ప్రకటించారు. కేసును కోర్టులో వాదించడంలో ప్రతిభకనపరిచిన స్పెషల్ పీపీ కాకుటూరు రమేష్‌రెడ్డి, కేసు విచారణతో పాటు సాక్ష్యాలు పొందుపరచడంలో ప్రతిభ కనపరిచిన డీఎస్పీ ఈ శ్రీనివాసులు, కేసు మోనటరింగ్ పోక్సో కోర్టు లైజన్ ఆఫీసర్, సాక్షులను కోర్టులో హాజరుపరచి ప్రాసిక్యూషన్‌కు సహకరించిన హెడ్ కానిస్టేబుల్ వైరవిను ఎస్పీ జీ కృష్ణకాంత్ అభినందించారు.

వసతిగృహం పరిశీలన

సంగం: సమాజంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సూచించారు. స్థానిక బీసీ బాలికల వసతిగృహాన్ని శుక్రవారం సాయంత్రం వారు సందర్శించారు. విద్యార్థినుల భద్రతను పరిశీలించారు. బాలికల రక్షణ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఏ సమస్య ఉన్నా వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు.

వ్యాస, చిత్రలేఖన పోటీలు

కావలి: పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వారోత్సవాలను శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజు రెడ్‌క్రాస్ భవన్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలను నిర్వహించారు. శనివారం ఉదయం వక్తృత్వ పోటీలు, సాయంత్రం సందేశాత్మక పాటల పోటీ నిర్వహించనున్నట్లు జేవీవీ పట్టణాధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ కమిటీ బాధ్యులు పీ శివకుమార్ , సుబ్బరాయశర్మ , షేక్ ఖాదర్‌బాషా, సీ శారద , ఏ. రమణయ్య, ప్రసాదరావు, జాన్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం



కావలి: పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జికి దక్షిణం వైపున రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు కావలి రైల్వే ఎస్సై రమాదేవి తెలిపారు. మృతుడు బులుగు, పచ్చ, తెలుపు రంగులతో కూడిన నిలువ చారల ఫుల్‌హ్యాండ్ షర్ట్, పచ్చరంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడికి సుమారు 35–40 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. రైలు ఢీకొనడం వల్ల గాయపడినట్లుగా భావిస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.